క్లుప్తంగా

అనారోగ్య బాధితులకు రూ.15వేల ఆర్థిక సాయం



దూబచర్లలో తొంటా కళావతికి వీల్‌చైర్ అందిస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: దూబచర్లలో పక్షవాతంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న తొంటా కళావతికి మండల మానవత సంస్థ రూ.8వేల విలువ చేసే వీల్‌చైర్‌ను గురువారం అందజేసింది. అనంతపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న తగరం వెంకటేశ్వరావు, యడ్లపల్లి పెదసుబ్బారావు, కేలా గణేష్‌లకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.15వేలు ఆసంస్థ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, గుళ్ల పూడివెంకటరత్నం, దావులూరి చిరంజీవి, కూచిపూడి ఉదయభాస్కరావు, ఓలిరెడ్డి సతీష్, గన్నమని మధుమోహన్, కనుమూరి ప్రసాద్, మర్రి మహేష్, కుమ్మరి శ్రీను, అప్పసాని సుధాకర్, వలుపు దుర్గారావు, బొల్లా నమశ్శివాయ, చేబ్రోలు రామకృష్ణ పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు



బాధితులకు ఆహార పొట్లాలు అందిస్తున్న పావనీకుమారి

నల్లజర్ల: విజయవాడ వరద బాధితులకు నల్లజర్ల మండలం సింగరాజుపాలెం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి తానే స్వయంగా చేసి 500 బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఎంపీడీఓ సింహాద్రి ఆధ్వర్యంలో 2500 ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లను వ్యానుపై వేసి విజయవాడ తరలించారు. అనంతపల్లిలో సూర్నిడి కిరణ్ ఆర్థిక సాయంతో ఆహార పొట్లాలు తయారు చేసి పంపారు. నల్లజర్ల మీనార్ మసీదు ఆధ్వర్యంలో షమీమ్, షేక్ సర్దార్, రఫీ, ఇలియాస్ షరీఫ్, ఇమాం సుభానీలు 2,500 పులిహోర ప్యాకెట్లు అందజేశారు

11న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

కొవ్వూరు: ఈనెల 11వ తేదీన ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ఎస్సీల వర్గీకరణ ప్రతిఘటన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బొంతా శ్యాం రవి ప్రకాష్ ప్రకటించారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంఘ నాయకులు సమావేశమయ్యారు. అదే రోజు ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా కొవ్వూరులో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మాసా ఆనంద్, గుబతాల సురేష్, సాకా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య దేవోభవ!

- ఘనంగా టీచర్స్ డే
- గురువులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, రోటరీ సభ్యులు

దేవరపల్లి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురష్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగల సంఘం మండల అధ్యక్షుడు పప్పు వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రజుమెమో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పప్పు వెంకటరామారావు ప్రసంగించారు. పలువురు విశ్రాంత ఉపాధ్యాయుల దంపతులు, ఉగ్యోగులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కొవ్వూరు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో తొగుమ్మి మండల పరిషత్ యూపీ స్కూలులో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలకి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యం సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎండీ హుస్సేన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బంగారు భవితకు ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు

నిడదవోలు రూరల్: ఉపాధ్యాయులు భావి భారత పౌరుల బంగారు భవిష్యత్‌కు మార్గ నిర్దేశకులని ఎంఈఓ కేవీ గణేష్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. సమిశ్రగూడెం ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తి సన్మానించారు. రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో సమిశ్రగూడెం విజ్ఞాన్-వికాస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షుడు కొండేపాటి రామకృష్ణ, కార్యదర్శి జీవీఎస్ కృష్ణారావు, క్లబ్‌సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లజర్ల: దూబచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యుత్ శాఖ లైన్‌ఇన్‌స్పెక్టర్ ఈదా డేవిడ్, యూనియన్ బ్యాంకు మేనేజరు వంశీధర్ 16 మంది ఉపాధ్యాయులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు జాతీయ అవార్డు

నల్లజర్ల: దూబచర్ల జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్సు టీచరుగా పనిచేస్తున్న బొందల శ్రీనివాస్ స్కోప్ ఫౌండేషన్ (గుంటూరు)ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచార్య దేవోభవ జాతీయ అవార్డు గురువారం అందుకున్నారు.

తాళ్లపూడి: మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తాళ్లపూడిలోని కరిబండి విద్యా సంస్థల్లోని ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు అధ్యాపకులతో కేకలను కట్ చేయించి, సత్కరించారు.

నిడదవోలు: పట్టణంలో రోటరీక్లబ్ ఆడిటోరియంలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు తట్టగుంట వెంకట పద్మావతి అన్నపూర్ణ, చొప్పకట్ల సీతారామశ్రీనివాస్, బొల్లిపా మేరీలిల్లిగ్రేస్, షేక్ మహబూబ్ షరీఫ్, గుడ్ల గోవర్ధన్‌రావు, వెల్పుల అరుణజ్యోతిలను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోర్లేపర వేంకట రత్న కుమార్, రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాలలో రోటరీక్లబ్ ఆఫ్ మిడ్ టౌన్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.కంబయ్యతోపాటు అధ్యాపకులు డాక్టర్ జానకీదేవి, పీపీఎల్ నారాయణ, డి.లావణ్య, జె.శోభారాణిలను ఘనంగా సత్కారించారు.

ఉండ్రాజవరం: మండల విద్యాశాఖ, గురుపూజోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం ప్రాథమిక పాఠశాల-1లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఈవోలు సక్సేనా రాజు, శారద జ్యోత్స్న హాజరై మాట్లాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డ్ గ్రహీతలు సీహెచ్‌వీ కృష్ణ ప్రసాద్, ఎల్.మూర్తిలను, మండల స్థాయిలో ఉత్తమ అవార్డ్ గ్రహీతలు కె.శ్రీనివాసు, జి.అజూబా, జి.పట్టాభిరామన్న, ఎ.కాంతామణికుమారి, సీహెచ్ అహల్యా మహలక్ష్మి, జి.విశాలాక్ష్మి, బి.ఎ.ప్రభావతిలను ఘనంగా సన్మానించారు.



సమిశ్రగూడెంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ సభ్యులు



ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఉపాధ్యాయులు

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వేడుకలకు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంఈఓలు బీబీఎస్ స్వరూప్, ఎస్ సూర్జాన్ హాజరయ్యారు. పలు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పెరవలి, ముక్కామల గ్రంథాలయాల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

భాస్కరరెడ్డికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

పెరవలి: మండలంలో ముగ్గురు ఉపాధ్యాయులు వి.సూర్యభాస్కరరెడ్డి, డి.ప్రసాద్, కె.శాంతారావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. భాస్కరరెడ్డిని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అభినందించారు.



దేవరపల్లిలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు



తొగుమ్మి గ్రామంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



దూబచర్ల హైస్కూలులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డేవిడ్

మట్టి గణపతులనే పూజించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నల్లజర్ల: వినాయక చవితి పండగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని, మట్టి వినాయక ప్రతిమనే పూజించాలని సీఐ శ్రీనివాస్ ఉత్సవ కమిటీలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసేవారు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. సింగిల్ విండో పద్ధతిలో రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్, ఇరిగేషన్ అనుమతులు ఉండాలన్నారు. నిబంధనల మేరకు పండగను జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు కృష్ణారావు, ఎంపీడీఓ సింహాద్రి, ఎస్ఐ హరిబాబు, విద్యుత్‌శాఖల ఏఈలు బాపిరాజు, నారాయణ పాల్గొన్నారు.

వినాయక చవితి పూజ పుస్తకావిష్కరణ



అన్నదేవరపేటలో వినాయక చవితి పూజ పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: అన్నదేవరపేటలో గురువారం వినాయక చవితి పూజ విధానాన్ని తెలిపే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు పరస రాధాకృష్ణ రచించిన వినాయక చవితి పుస్తకాన్ని పారిశ్రామిక వేత్త అల్లూరి విక్రమాధిత్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. వెయ్యి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరస రాధాకృష్ణ, జీవీ ప్రసాద్, కూచిపూడి లక్ష్మణరావు, కొర్లపాటి లక్ష్మణరావు, కూచిపూడి గణపతి, కొడమంచిలి జాన్‌బాబు, బోడపాటి కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి డిపో మేనేజర్ వివక్ష చూపుతున్నారంటూ ఫిర్యాదు

ఈనెల 10న కొవ్వూరులో ధర్నాకి పిలుపు

కొవ్వూరు: ఆర్టీసీ డిపో మేనేజర్ విధుల కేటాయింపులో వివక్షత చూపిస్తున్నారని ఏపీఎస్ ఆర్టీసీ (పీటీడీ) బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఓరుగంటి భూపతిరాజు ఆరోపిస్తున్నారు. డీఎం వైఖరికి నిరసనగా ఈనెల 10వ తేదీన డిపో వద్ద ఉదయం పది గంటలకు ధర్నా నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. డిజిటల్ చార్టుతో సంబంధం లేకుండా విధులు కేటాయించడమే కాకుండా కొందరు ఉద్యోగులపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు సులువైన డ్యూటీ వేస్తున్నారని, అనారోగ్య పరమైన సమస్యలున్నా వారికి సైతం తనకు నచ్చిన విధంగా విధులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికార్ల ఆదేశాలు లేకుండానే రాజమహేంద్రవరానికి చెందిన ఉద్యోగులను ఓడీపై డిపోలో పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. జనవరి ఒకటి 2019 ఎండీ సురేంద్రబాబు ఇచ్చి సర్క్యులర్ ప్రకారం విధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులకు ఓడీ కేటాయింపు ఎండీ సర్క్యులర్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ మాత్రం ఏవిధమైన నిబంధనలు పాటించడం లేదని ఆయన ఆరోపించారు. డిపో మేనేజర్ వైఖరికి నిరసనగా బహుజన సంఘాలు, దళిత ప్రజా సంఘాలు, మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, కుల వివక్ష పోరాట సమితి, ఇతర ప్రజా సంఘాల మద్దతుతో 10న ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. డిపో మేనేజర్‌పై స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తహసీల్దార్, పట్టణ పోలీసు ఇన్‌స్పెక్టర్‌కి, రాజమహేంద్రవరం డీపీటీఓకి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎర్రకాలువ ఉధృతికి మొదటి ప్రమాద హెచ్చరిక

నిడదవోలు రూరల్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎర్రకాలువకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో నందమూరు అక్విడెక్టు వద్ద గురువారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు జలవనరులశాఖ ఏఈ పెద్దిరాజు తెలిపారు. అక్విడెక్టు వద్ద 29 అడుగులకు నీటిమట్టం చేరిందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పోటీలు



ముక్కామలలో విజేతలకు బహుమతులు అధికారులు

పెరవలి: విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో ఉన్న సృజనాత్మకత వెలికి వస్తుందని తహసీల్దార్ డి.అత్యుత కుమారి, ఎస్సై అప్పారావు తెలిపారు. ముక్కామల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయకుల ప్రతిమలను తయారు చేయడం, డ్రాయింగ్ వేయడం వంటి పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల సురేంద్ర, రేలంగి రాజేష్, ఎల్లమెల్లి మోహనరావు, కరుటూరి విశ్వనాదం, ఓరుగంటి కవితలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

దేవరపల్లి: గ్రామాలో సీజన్‌గా వచ్చే వ్యాధులు విజృంభించడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేసి మందులు అందజేస్తున్నారు. వైద్యశిబిరాల్లో రోగులకు వైద్యాధికారులు, వైద్యసిబ్బంది వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. గురువారం స్థానిక దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసి 50 మంది పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో ఏఎన్ఎం వీరేశ్వరపు రమ్య, ఆశా వర్కర్లు సిర్రా జాన్సీ, ఎండీ స్వాతి, మడతల రాణి, రాపాక శ్రీస్వర్ణ, పీతల గంగాభవాని, బీఎస్‌వీ లక్ష్మీ(ఎడబ్ల్యూడబ్ల్యూ) పాల్గొన్నారు.



దేవరపల్లి శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చాగల్లు: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేక అధికారి పి.చంద్రశేఖర్ అన్నారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైరల్ ఫీవర్‌లు ఎక్కువ ఉన్న కారణంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిపించాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. చవితి ఉత్సవ కమిటీలు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఇన్‌చార్జి, ఎంపీడీఓ శ్రీమతి పి.నిర్మలకుమారి, ఎస్సై కె.నరేంద్ర, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మదర్ థెరిసాకు ఘన నివాళి

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం శాంతిసెంటర్‌లో బాబూ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మదర్‌థెరిస్సా విగ్రహానికి మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముప్పిడి నరసింహమూర్తి, స్థానిన నాయకులు ఎం.రాజారత్నంలు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో యూత్ సభ్యులు మెరిపే సత్తిరాజు, కె.మధు, సనమండ్ర ఏసు, మల్లిపూడి కల్యాణ్, పెదపూడి కిషోర్, ఎం.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ దుస్తుల తయారీదార్లకు గిరాకీ

రాజమహేంద్రవరం సిటీ: నవీన సమాజంలో మహిళల వస్త్రాలంకరణలో వస్తున్న మార్పుల నేపథ్యంలో వివిధ మోడళ్ల దుస్తుల తయారీదారులకు డిమాండ్ ఉందని ప్రముఖ వ్యాపారవేత్త దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో జరిగిన 73వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న కుట్టుపనివార్లు తక్కువగా ఉండడం వల్ల, వివిధ మోడళ్ల వస్త్రాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నట్టు వివరించారు. మహిళలు కుట్టు శిక్షణ, మగ్గం వర్క్ ద్వారా మంచి సంపాదన పొందవచ్చన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రతినిధి రాంబాబు మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన మొత్తాలు పొదుపు చేయడం వల్లే, కుటుంబాలు ఆర్థికంగా మనగలుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ 19 వేల మందికి ఉచిత కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, కంప్యూటర్లో శిక్షణ అందించామన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. నూతన బ్యాచ్‌కు ఈ నెల 11 వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు.

పశు వధశాలలపై పోలీసుల దాడులు



నెహ్రూనగర్‌లో అనధికార పశు వధను అడ్డుకుంటున్న ఎస్సై శోభన్‌కుమార్, సిబ్బంది

నిడదవోలు: అనుమతులు లేకుండా చేస్తున్న పశువుల వధను నిడదవోలు పోలీసులు అడ్డుకున్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్‌కు వచ్చిన సమాచారంతో స్థానిక నెహ్రూనగర్‌లో వార్డు సచివాలయం సమీపంలో గురువారం పశువధ శాలపై దాడులు చేశారు. అక్కడ అనుమతులు లేకుండా పశువులను వధించడాన్ని గుర్తించారు. పోలీసులు చేరుకున్న సమయానికే అక్కడ ఐదు పశువులను వధించారు. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కేసులో అబ్దుల్ రసీద్, మహమ్మద్ జకుల్లాకురేషి, షేక్ ఫిర్దోష్, షేక్ మెహిద్దీన్‌బాషా, ఆరేపల్లి రాంసాయితేజ, షేక్ నాగూర్‌మీరావలీలను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నాలుగు ఆటోలు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వధించిన ఐదు పశువులను వీఆర్వో, వార్డు సచివాలయ కార్యదర్శి సమక్షంలో పూడ్చి వేశారు. ఈ పశు వధశాలలో ఉన్న 50 పశువులను ఉంగుటూరు నియోజకవర్గంలోని నాచుకుంట గ్రామంలో ఉన్న గో సంరక్షణ కేంద్రానికి పంపిస్తున్నట్లు ఎస్సై పి.శోభన్‌కుమార్ తెలిపారు.

పెరుగుతున్న గోదావరి వరద

- నీటి మునిగిన గోష్పాదక్షేత్రం స్నాన ఘట్టాలు
- ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- మద్దూరులంకలో వరద ఉధృతి పరిశీలించిన సబ్ కలెక్టర్



మద్దూరులంకలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది వరద ఉధృతి పెరుగుతోంది. వరద ఉధృతి అధికంగా ఉండడంతో స్థానిక గోష్పాదక్షేత్రంలో స్నాన ఘట్టాలు పూర్తిగా నీటమునిగాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద వరద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి నీటిమట్టం 11.60 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతుంది. నీటి మట్టం 11.75 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికని జారీ చేస్తారు. భద్రచలంలో 45 అడుగులకు పైబడి ప్రవహిస్తున్న స్వల్పంగా తగ్గుతూ, పెరుగుతూ నిలకడగా దోబూచులాడుతోంది. ఆనకట్ట నుంచి గురువారం రాత్రి ఏడు గంటలకు 9,68,015 క్యూసెక్కుల వరదనీటిని సముద్రానికి విడిచిపెడుతున్నారు. దీంతో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం సాయంత్రం మద్దూరులంక గ్రామంలో వరద ఉధృతి పరిశీలించారు.ఆనకట్టకి దిగువన గతంలో గ్రామంలోకి వరద ప్రవేశించిన ప్రాంతంలో ఇసుక బస్తాలు వేశారు. గ్రామంలో చుట్టూ వరద నీరు ఉండడంతో క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సబ్ కలెక్టర్ స్వయంగా పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆయనతో పాటు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అజయ్‌బాబు, వీఆర్వో సర్వేశ్వరరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.